సోమవారం 20-5-2024

# ముందడుగు

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp: 9491114616

email: mundadugu111@gmail.com

సంపుటి: 1, సంచిక: 340, పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

దినపత్రిక

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

# రాహుల్ గాంధీపై మోడీ తీవ్ర విమర్శలు

## వయనాడ్ నుంచి రాయ్‌బరేలీకి పారిపోయారు ▪ ఓట్లు అడిగిన సోనియా గాంధీపై విమర్శలు

**ముందడుగు ఝార్ఖండ్:**

తన కుమారుడి కోసం రాయ్‌బరేలీ ప్రాంత ప్రజలను ఓట్లు అడిగిన సోనియా గాంధీపై ప్రధాని నరేంద్ర మోడీ విమర్శలు గుప్పించారు. ఝార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్‌లో ఎన్నికల ప్రచార సభలో ప్రధాని ప్రసంగించారు. ''సోనియా గాంధీ రాయ్‌బరేలీని వదిలి వెళ్లిపోయారు. కొవిడ్ తర్వాత ఆమె తన నియోజకవర్గాన్ని ఒక్కసారి కూడా సందర్శించలేదు. ప్రస్తుతం తన కుమారుడిని రాయ్‌బరేలీ ప్రజల చేతుల్లో పెడుతున్నానంటూ.. ఓట్లు అడుగుతున్నారు. ఇక్కడ పోటీలో దింపడానికి ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్ అభివృద్ధి కోసం పని చేసిన ఒక్క కార్యకర్త కూడా మీకు కనిపించలేదా? వారంతా (గాంధీ కుటుంబం) ఈ స్థానాన్ని తమ కుటుంబ ఆస్తిగా భావిస్తున్నారు'' అని మోడీ విమర్శలు గుప్పించారు. వయనాడ్ నుంచి పోటీ చేసిన రాహుల్ గాంధీ.. ఆ తర్వాత రాయ్‌బరేలీ నుంచి సిద్ధమవ్వడంపై ప్రధాని మండిపడ్డారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు కాంగ్రెస్ యువరాజ్ (రాహుల్‌ను ఉద్దేశిస్తూ) వయనాడ్ నుంచి ఇప్పుడు రాయ్‌బరేలీకి పారిపోయారని ఎద్దేవా చేశారు. ''స్కూలుకు వెళ్లే ఎనిమిదేళ్ల పిల్లాడు.. తన తండ్రి అక్కడ చదువుకున్నప్పటికీ.. అలా చెప్పుకోడు. రాయ్‌బరేలీ వెళ్లిన రాహుల్ మాత్రం ఇది తన తల్లిది అని చెబుతూ తిరుగుతున్నారు.



ఈ కుటుంబ నేపథ్యం ఉన్నవారు ఎంపీ స్థానాలకు వీలునామా రాస్తున్నారు. ఇలాంటి కుటుంబ పార్టీల నుంచి ఝార్ఖండ్‌ను కాపాడాలి'' అని పిలుపునిచ్చారు.

# తెలంగాణకు మరో వారం రోజులు వర్షాలు

## క్యుములోనింబస్ మేఘాలతో కుండపోత వర్షాలు



**ముందడుగు తెలంగాణ:**

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా మరో వారం రోజులు ఓ మోస్తారు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. పిడుగులు పడే అవకాశం ఉందని, గంటకు 30 నుండి 40 కిలో మీటర్ల వేగంతో గాలులు వీస్తాయని పేర్కొంది. నిన్న సాయంత్రం కూడా హైదరాబాద్ మిగతా 2లో

# యాదాద్రి భక్తులకు డ్రెస్ కోడ్ తప్పనిసరి

## జూన్ 1 నుంచి నిబంధన అమల్లోకి

**ముందడుగు యాదాద్రి:**



తెలంగాణ రాష్ట్రంలో ప్రసిద్ధ ఆధ్యాత్మిక క్షేత్రమైన యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులకు ఇకనుంచి డ్రెస్ కోడ్ తప్పనిసరి కానుంది. నరసింహస్వామి దర్శనానికి వచ్చే భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించాలని యాదగిరిగుట్ట దేవస్థానం నిర్ణయించింది. వివిధ సేవల్లో పాల్గొనే భక్తులు మిగతా 2లో

# గ్రాడ్యుయేట్స్ ఓటు వేసే ముందు ఆలోచించాలి

## భువనగిరి సమావేశంలో కేటీఆర్

**ముందడుగు భువనగిరి:**



ఓటు వేసే ముందు పట్టభద్రులు ఆలోచించాలని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కోరారు. వరంగల్ ఖమ్మంనల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో పార్టీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి విజయం కోసం కృషి చేయాలని ఆయన అన్నారు. భువనగిరిలోని సాయి ఫంక్షన్ హాల్లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మిగతా 2లో

## నాణ్యత లేని హైదరాబాద్ బిర్యానీ రెస్టారెంట్లు

వివరాలు 2లో



## రాష్ట్రంలో పెళ్లి కాని పురుషులకు పెన్షన్ ఇవ్వాలి

వివరాలు 2లో



## సింగపూర్ ను భయపెడుతున్న కరోనా వైరస్

వివరాలు 3లో




## యువత చూడాల్సిన మైక్రో చిత్రం వెన్నెల

వివరాలు 4లో

ముందడుగు
సోమవారం, 20-5-2024, హైదరాబాద్

# తెలంగాణకు మరో వారం రోజులు వర్షాలు

మొదటిపేజీ తరువాయి

సహా, అనేక జిల్లాలలో ఆకస్మిక వర్షాలు కురవడంతో ప్రజలు అనేక చోట్ల ఇబ్బందులను ఎదుర్కొన్నారు.

**ఈ జిల్లాలకు ఎల్లో అలెర్ట్**

వరంగల్, నల్గొండ, కరీంనగర్, రంగారెడ్డి, ఆదిలాబాద్, మహబూబ్నగర్, హైదరాబాద్ జిల్లాలలో వర్షాలు కురుస్తాయని, 22వ తేదీ వరకు ఈ జిల్లాలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. అయితే మే 31వ తేదీన ముందస్తుగానే దేశంలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశిస్తాయని భారత వాతావరణ శాఖ ఇప్పటికే ప్రకటించింది.

**క్యుములోనింబస్ మేఘాలతో కుండపోత వర్షాలు**

ఈసారి తీవ్రమైన ఎండలు నమోదు కావడంతో వర్షాలు కూడా అదే స్థాయిలో ఉండనున్నాయి. అధిక ఉష్ణోగ్రతలు నమోదైన సమయంలో క్యుములోనింబస్ మేఘాలు ఏర్పడి అకస్మాత్తుగా కుండపోత వర్షాలు కురుస్తాయి. ప్రస్తుతం తీవ్రమైన ఎండలు రాష్ట్రంలో లేనప్పటికీ, గత నెలలో నమోదైన ఎండల నేపథ్యంలో ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలు అన్నదాతలకు కన్నీరు తెప్పిస్తున్నాయి.

# నాణ్యత లేని హైదరాబాద్ బిర్యానీ రెస్టారెంట్లు

## కొన్ని రెస్టారెంట్లలో నాసిరకం ఆహార పదార్థాలు ▪ ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మిక తనిఖీలు

ముందడుగు హైదరాబాద్:

హైదరాబాద్ బిర్యానీ అంటే మన దేశంలోనే గాక ప్రపంచవ్యాప్తంగా మంచి పేరు, గుర్తింపు ఉంది. నగర వాసులు వీకెండ్స్‌లో ఎక్కువగా రెస్టారెంట్లలో బిర్యానీని ఆస్వాదిస్తుంటారు. నగరానికి వచ్చినవారు ఇక్కడి బిర్యానీ రుచి చూడకుండా తిరిగి వెళ్లరు. అలాంటిది కొన్ని రెస్టారెంట్లు మాత్రం వంటకాల్లో నాణ్యత పాటించకపోవడం, నాసిరకమైన పదార్థాలను వాడటం లాంటివి చేస్తూ బిర్యానీ ప్రియులకు దిగ్భ్రాంతిని కలిగిస్తున్నాయి. ఈ క్రమంలోనే ఫుడ్ సేఫ్టీ అధికారులు తరచూ తనిఖీలు జరుపుతూ అలాంటి రెస్టారెంట్లపై చర్యలు తీసుకుంటున్నారు. తాజాగా, తెలంగాణ ఫుడ్ సేఫ్టీ విభాగానికి చెందిన టాస్క్‌ఫోర్స్ బృందం శనివారం లక్డీకాపూల్ ప్రాంతంలోని పలు రెస్టారెంట్లు, హోటళ్లలో తనిఖీలు చేసింది.



అపరిశుభ్రతను గుర్తించి, లేబొరేటరీకి పంపడానికి నమూనాలను తీసుకుంది. లక్డీకపూల్‌లోని 'రాయలసీమ రుచులు ' రెస్టారెంట్‌లో తనిఖీ చేసిన అధికారులకు నల్ల ఈగలు ఎక్కువగా సోకిన 20 కిలోల మైదా, పురుగులు సోకిన రెండు కిలోల చింతపండుతో పాటు, గడువు ముగిసిన అమూల్ పాలను గుర్తించారు. కొంత నాసిరకం ఆహార పదార్థాలను గుర్తించారు. తయారీ లైసెన్స్ లేని మొత్తం 168 గోలీ సోడా బాటిళ్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. లేబుల్ లేని జీడిపప్పు, రూ.11,000 విలువైన జావర్ రోటీని కూడా తనిఖీల్లో దొరికింది. అంతేకాకుండా, వంటగది ప్రాంతంలో సరికాని నిల్వ పద్ధతులు, పరిశుభ్రత సమస్యలు కూడా గమనించారు. మరోవైపు, షా ఘౌస్‌లో లేబుల్ చేయని సిద్ధం చేసిన/సెమీసిద్ధమైన వస్తువులు నిల్వలో గుర్తించారు. ఫుడ్ హ్యాండ్లర్ల మెడికల్ రికార్డులు కూడా అందుబాటులో లేవు. నీటి స్వచ్ఛత చట్టబద్ధమైన నమూనా తీసుకున్నారు. పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపారు. నాసిరకమైన పదార్థాల వాడకంపై సీరియస్ అయ్యారు. ఈ మేరకు సదరు రెస్టారెంట్లు, హోటళ్లపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

# యాదాద్రి భక్తులకు డ్రెస్ కోడ్ తప్పనిసరి

మొదటిపేజీ తరువాయి

తప్పనిసరిగా సంప్రదాయ దుస్తులు ధరించే నియమం జూన్ 1 నుంచి అమల్లోకి రానుంది.

యాదాద్రి ఆలయ పునర్నిర్మాణం తర్వాత లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునే భక్తుల సంఖ్య పెరుగుతోంది. ఆలయంలో ఇప్పటికే ఆలయ ఈవోతోపాటు సిబ్బంది కూడా డ్రెస్ కోడ్‌ను పాటిస్తున్నారు. హిందూ సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించేలా చర్యలు చేపట్టాలని యాదగిరిగుట్ట దేవస్థానం నిర్ణయించింది. నిత్య కల్యాణం, హోమం, జోడు సేవలు, శ్రీసుదర్శన నారసింహ హోమం, శ్రీసత్యనారాయణ స్వామి వ్రతాలు తదితర ఆర్జిత సేవల్లో పాల్గొనే భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించేలా నియమాన్ని అమలు చేయనుంది.


# గ్రాడ్యుయేట్స్ ఓటు వేసే ముందు ఆలోచించాలి

మొదటిపేజీ తరువాయి

''ఓటు వేసే ముందు పార్టీతో పాటు అభ్యర్థి గుణగణాలనూ పరిశీలించండి. తెలంగాణలో ఇప్పటి వరకు జరిగిన గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధించింది. మేం గుడి పేరుతో ఓట్లు అడగలేదు. ప్రాజెక్టులు కట్టాం.. వాటికి దేవుళ్ల పేర్లు పెట్టాం. కేసీఆర్ ప్రభుత్వం వచ్చాక మూడు మెడికల్ కళాశాలలు ఇచ్చాం. అసెంబ్లీ ఎన్నికల్లో మా ఓటమికి రెండు కారణాలున్నాయి. ఒకటి.. మేం చేసిన పనిచెప్పుకోలేదు.. రెండు.. కొన్ని వర్గాలను దూరం చేసుకున్నాం. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓ వైపు బిట్స్ పిలానీలో చదువుకున్న అభ్యర్థి.. మరోవైపు బ్లాక్ మెయిలర్, లాబీయింగ్ చేసే అభ్యర్థి ఉన్నారు. ఎవరు కావాలో ప్రజలు ఆలోచించుకోవాలి'' అని కేటీఆర్ అన్నారు.

# తెలంగాణ ఎంసెట్ ఫలితాల్లో ఏపీ విద్యార్థి టాపర్

## ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకు చెందిన జోతిరాదిత్య



ముందడుగు తెలంగాణ:

తెలంగాణ ఎంసెట్ పరీక్ష ఫలితాలలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా విద్యార్థి మొదటి ర్యాంకు సాధించాడు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా పాలకొండ మండలం యరకరాయపురం గ్రామానికి చెందిన సతివాడ జోతిరాదిత్య తెలంగాణ రాష్ట్ర ఎంసెట్ ఫలితాలలో సత్తా సాధించడంతో ఆదిత్య తల్లిదండ్రులు స్నేహితులతో పాటు జ్యోతిరాదిత్య గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ఎంసెట్ ఫలితాల్లో మొదటి ర్యాంక్ రావడంతో తల్లిదండ్రులు మోహనరావు, హైమావతి ఆనందంతో కుటుంబ సమేతంగా మిఠాయిలు పంచుకొని సెలబ్రేషన్స్ చేసుకున్నారు. జ్యోతిరాదిత్య మొదటి నుండి ఎంతో చురుగ్గా ఇష్టంగా చదివేవాడని కృషి పట్టుదలే అతనికి తెలంగాణ రాష్ట్ర ఎంసెట్‌లో మొదటి ర్యాంక్ సాధించేలా చేసిందని అతని తల్లిదండ్రులు, గ్రామస్తులు అంటున్నారు.

# రాష్ట్రంలో పెళ్లి కాని పురుషులకు పెన్షన్ ఇవ్వాలి

▪ రాతపూర్వకంగా హామీ ఇచ్చిన వారికే ఓటు

▪ హర్యానాలోని బ్రహ్మచారుల సంఘం డిమాండ్



ముందడుగు హర్యానా:

ఎన్నికల వేళ హర్యానాలోని బ్రహ్మచారుల సంఘం కీలక డిమాండ్లు చేస్తోంది. రాష్ట్రంలో పెళ్లి కాని వారికి, పెళ్లి అయి భార్యను పోగొట్టుకున్న వారికి పింఛన్ పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అంతేకాకుండా రాష్ట్రవ్యాప్తంగా పెళ్లి కాని వారు, భార్యను పోగొట్టుకున్న వారు ఎంత మంది ఉన్నారు అనేది లెక్కించాలని పేర్కొన్నారు. తమకు ప్రభుత్వం నుంచి ఏదైనా సాయం అందించాలని కోరుతున్నారు. ఇదేదో హామీ ఇస్తే సరిపోదని.. దానిని సమర్థవంతంగా అమలు చేస్తామని రాతపూర్వకంగా హామీ ఇచ్చిన పార్టీలకే ఈ లోక్‌సభ ఎన్నికల్లో తాము ఓటు వేస్తామని హర్యానాలోని బ్రహ్మచారుల సంఘం తేల్చి చెప్పింది. గతంలో ప్రభుత్వం తీసుకువచ్చిన పెన్షన్ పథకం సరిగ్గా అమలు జరగడం లేదంటూ వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. హర్యానాలో ని 40 ఏళ్లు దాటిన పెళ్లి కానివారు, భార్య లేని వారు కలిసి.. 2022 లో సమస్త అవివాహిత పురుష సమాజం పేరుతో ఒక సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అయితే ఈ సంఘంలో ఒక్క హర్యానాలోనే 7 లక్షల మంది సభ్యులుగా ఉండటం గమనార్హం. ఈ 7 లక్షల మంది తరపున సమస్త అవివాహిత పురుష సమాజం.. ఒక ప్రకటన చేసింది. అయితే గత ఏడాది హర్యానా ముఖ్యమంత్రిగా ఉన్న మనోహర్ లాల్ ఖట్టర్.. ఆ రాష్ట్రంలో సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టారు. 45 నుంచి 60 ఏళ్ల వయసు ఉన్న పెళ్లి కాని స్త్రీ, పురుషులకు పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ పథకం కింద అర్హులైన వారికి నెలకు రూ.2750 పెన్షన్‌గా అందిస్తున్నారు. మనోహర్ లాల్ ఖట్టర్ తీసుకువచ్చిన పెన్షన్ పథకం సరిగ్గా అమలు కావడం లేదని సమస్త అవివాహిత పురుష సమాజం.. ఆరోపించింది. అంతేకాకుండా ఒకరిద్దరికి తప్ప తమలో అన్నివిధాలుగా అర్హులైన చాలా మందికి ఈ పెన్షన్ అందడం లేదని పేర్కొంది. అందుకే ఎన్నికల వేళ ఈ డిమాండ్‌ను తెరపైకి తెచ్చినట్లు వెల్లడించింది.

ముందడుగు
సోమవారం, 20-5-2024, హైదరాబాద్

## తన భార్య రోజు కొడుతోంది..

# నన్ను కాపాడండి

- రోజు మానసికంగా, శారీరకంగా హింసిస్తుంది
- ఒంటిపై భార్య చేసిన గాయాలను చూపిస్తూ భర్త ఆవేదన

**ముందడుగు హైదరాబాద్:**



తనకు పెళ్లి జరిగినప్పటి నుండి తనను మానసికంగా, శారీరకంగా హింసిస్తూ కొడుతుందని భర్త టెమూజియన్ ఆవేదన వ్యక్తం చేశాడు. హైదరాబాద్ హైదర్ గూడ లోని ఎన్ఎస్ఎస్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఒంటిపై భార్య చేసిన గాయాలను చూపిస్తూ, మీడియాతో తన గోడును చెప్పుకున్నాడు. తన భార్య నుండి తనకు , తన తల్లిదండ్రులకు ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలంటూ ఓ బాధిత భర్త పోలీసులను వేడుకున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లోని రాజోలు ప్రాంతానికి చెందిన టెమూజియన్‌కు అమలాపురంనకు చెందిన లక్ష్మీ గౌతమితో ఏడేళ్ల క్రితం వివాహం జరిగినట్లు తెలిపాడు. మల్లారెడ్డి కాలేజీలో ఇంగ్లీష్ ప్రొఫెసర్‌గా పని చేస్తూ, భార్యతో కలిసి అల్వాల్ లో నివాసం ఉంటున్నట్లు వివరించాడు. తమకు ఐదేళ్ల కొడుకు ఉన్నట్లు పేర్కొన్నారు. అయితే పెళ్లైనప్పటి నుండి భార్య తనను అకారణంగా హింసిస్తుందని తెలిపాడు. పలుమార్లు పెద్ద వాళ్ల సమక్షంలో మాట్లాడిన ఆమె తీరు మారలేదన్నారు. ఇటీవల తనను చంపేందుకు కత్తితో దాడి చేసినట్లు కన్నీరు పెట్టుకున్నాడు.

ఈ విషయంపై స్థానిక అల్వాల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసానని.. అయితే, పోలీసులు కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. మహిళలకు ఒక చట్టం, పురుషులకు ఒక చట్టం ఉంటుందా అని ప్రశ్నించారు. తాను నిన్నటి నుండి ఇంటికి వెళ్లలేదని, వెళ్తే తన భార్య మళ్లీ దాడి చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశాడు. పోలీసులు తన భార్యపై కేసు నమోదు చేసి, తనకు రక్షణ కల్పించాలని బాధిత భర్త వేడుకున్నాడు.

## పటిష్టమైన ప్రణాళికతో సివిల్స్ పరీక్షల్లో విజయం

### ఏసీఈ ఐఏఎస్ అకాడమీ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ శివతేజ

**ముందడుగు హైదరాబాద్:**




పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు శిక్షణపై సంపూర్ణ విశ్వాసం కలిగినప్పుడే అభ్యర్థులు ఎంచుకున్న లక్ష్యాన్ని సాధిస్తారని ఏసీఈ ఐఏఎస్ శిక్షణ సంస్థ వ్యవస్థాపక డైరెక్టర్ శివతేజ తెలిపారు. ఐపిఎస్, ఐఎఎస్ లలో శిక్షణ పొందుతున్న అభ్యర్థులు హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య కళానిలయంలో ఏసీఈ ఐఎఎస్ ఆఫ్ లైన్ కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించారు. గతంలో హైదరాబాద్ ఐపిఎస్, ఐఎఎస్ శిక్షణ కేంద్రానికి హబ్బుగా ఉండేదని అనేక మార్పుల నేపథ్యంలో పోటీ పరీక్షల కోసం, దేశ రాజధానికి వెళ్లి అనేక ఇబ్బందులకు గురికావాల్సిన పరిస్థితి నెలకొందని ఆయన వివరించారు. పోటీ పరీక్షకు సిద్ధమే అభ్యర్థుల అవసరాలను గుర్తించి హైదరాబాద్లోనే అన్ని వర్గాల విద్యార్థిని, విద్యార్థులకు సివిల్స్ లో అనేక రకాలుగా మెలకువలను నేర్పుతున్నట్లు ఆయన తెలిపారు. ఆర్థిక స్తోమత లేని అభ్యర్థులకు కూడా తమ వంతు సహకారం అందిస్తున్నట్లు ఆయన చెప్పారు.... యూపీఎస్సీ సివిల్స్ లో గత మూడు సంవత్సరాలుగా జాతీయస్థాయి ర్యాంకులు సాధించిన 9 మంది ఐపీఎస్, ముగ్గురు ఐఏఎస్ అభ్యర్థులను ఒకే వేదికపైకి ఏసీఈ సంస్థ తీసుకువచ్చిందన్నారు..... ఆయా అభ్యర్థులు సాధించిన విజయాలను అనుసరించిన వ్యూహాలను మెలకువలను పోటీ పరీక్ష సిద్ధమవుతున్న అభ్యర్థులకు కూలంకుశంగా వివరించారు.



## సింగపూర్ ను భయపెడుతున్న

# కరోనా వైరస్

- వారం రోజుల్లో 25వేలకు పైగా కేసులు నమోదు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న సింగపూర్ ప్రభుత్వం

**ముందడుగు సింగపూర్:**

ప్రపంచాన్ని వణికించిన కరోనా వైరస్ ఇప్పుడు మళ్లీ సింగపూర్లో విజృంభిస్తోంది. ఈనెల 5వ తేదీ నుంచి 11వ తేదీ మధ్య 25 వేల 900 కు పైగా కరోనా కేసులు నమోదైనట్టు అక్కడి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కుంగ్ తెలిపారు. సింగపూర్లో కోవిడ్ వ్యాప్తి ఉధృతంగా ఉందని, ప్రజలు మాస్కులు ధరించాలని అయన అక్కడి వారికి సూచించారు.

కరోనా కొత్త వేరియంట్ వ్యాప్తి జరుగుతుందని, మాస్కులు ధరించి, సామాజిక దూరం పాటించి అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఒక్క వారం రోజుల వ్యవధిలోనే వేల సంఖ్యలో కరోనా కేసులు నమోదు కావడం ఆందోళన కలిగిస్తున్నది అన్నారు. అంతేకాదు ఆసుపత్రులన్నీ అలర్ట్ కావలసిన అవసరం ఉందని పేర్కొన్నారు. అన్ని వైద్య సదుపాయాలను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ఆసుపత్రులలో పడకల సామర్థ్యాన్ని పెంచుకోవాలన్నారు.

### నాలుగు వారాల్లోనే భారీగా కేసులు

ప్రస్తుతం విపరీతంగా ఉన్న ఉధృతి నాలుగు వారాల్లో గరిష్ట స్థాయికి చేరుకోవచ్చని సింగపూర్ ఆరోగ్య మంత్రి ఆంగ్ యే కుంగ్ తెలిపారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులలో నిత్యం 250 మంది వరకు ఆసుపత్రులలో చేరుతున్నారని పెరుగుతున్న కేసులకు అనుగుణంగా ఆసుపత్రులు కూడా సంసిద్ధం కావాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు.

### సింగపూర్ దేశంలో కరోనా కొత్తవేవ్

ఏప్రిల్ చివరి వారంలో 13700 కరోనా కేసులు నమోదైనట్టు తెలిపిన ఆయన, ప్రస్తుతం కరోనా కేసుల ఉధృతి తీవ్రంగా కొనసాగుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. దేశంలో కరోనా కొత్త వేవ్ ప్రారంభమైందని పేర్కొన్న సింగపూర్ ఆరోగ్య శాఖ మంత్రి ఈ వేవ్ ను నిశితంగా పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. కేసుల సంఖ్య భారీగా పెరుగుతున్న క్రమంలో తీసుకోవలసిన చర్యలపై సమీక్షలు జరుపుతున్నామని వెల్లడించారు.

### రెండు కొత్త వేరియంట్ల ఉధృతి

**కోవిడ్ బాధితులను ఆస్పత్రిలో చేర్పించే అవసరం లేకుండా, ఇంటి వద్ద నుండే చికిత్స అందించే విధానాన్ని కూడా పరిశీలిస్తున్నామని ఆయన తెలిపారు. కరోనా వ్యాప్తి నేపథ్యంలో సింగపూర్ పౌరులు మరోమారు కరోనా వ్యాక్సిన్ తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం సింగపూర్లో కేపీ. 1, కేపీ .2 కరోనా వేరియంట్ కేసులు మూడింట రెండు వంతులు నమోదు అవుతున్నాయి అన్నారు. ఈ రెండు కరోనా వేరియంట్లు ఎక్కువ వ్యాప్తి చేయగలిగిన, మరింత తీవ్రమైన వ్యాధిని కలిగించే వేరియంట్లని సింగపూర్ ఆరోగ్య శాఖ ఇంకా నిర్ధారించలేదు. అయితే దీనివల్ల వ్యాధి వ్యాప్తి మాత్రం ఎక్కువ జరుగుతుందని పేర్కొన్నారు. అందరూ అలెర్ట్ గా ఉండాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు.**

ముందడుగు
సోమవారం,
20-5-2024,
హైదరాబాద్



# ఈ పరిస్థితిలో జగన్ విదేశీ పర్యటనలా

- పగలు, ప్రతీకారాలతో రాష్ట్రం రగులుతోంది
- రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడెదెవరు
- జేడీ లక్ష్మీనారాయణ కీలక వ్యాఖ్యలు

**ముందడుగు విశాఖపట్నం:**

ఏపీలో పోలింగ్ సరళి పైన భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఇదే సమయంలో ముఖ్యమంత్రి జగన్ పై జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షుడు జేడీ లక్ష్మీనారాయణ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల తర్వాత రాష్ట్రంలో జరిగిన హింసను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇటువంటి ఘటనలు జరుగుతున్నప్పుడు సీఎం విదేశీ పర్యటనలకు వెళ్లడమేమిటని ప్రశ్నించారు. జగన్ రాష్ట్రంలో ఉండాలని.. శాంతి భద్రతలను కాపాడవలసింది ముఖ్యమంత్రి, ఆయన మంత్రులేనని అన్నారు. పోలింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడం గర్హనీయమన్నారు. పగలు, ప్రతీకారాలతో రాజకీయ పార్టీలు.. పగ తీర్చుకోవడం సిగ్గుతో తలదించుకోవలసిన విషయమని లక్ష్మీనారాయణ వ్యాఖ్యానించారు. రోడ్ల మీద రాడ్లు పట్టుకొని దండయాత్రలు చేయడం మనం లైవ్‌లో చూశామని, ఆయా పార్టీల నేతలు దాడులను నియంత్రించలేక పోయాయని మాజీ జేడీ విమర్శించారు. దాడులకు పాల్పడిన వారిని పార్టీ నుంచి ఎందుకు సస్పెండ్ చేయలేదని ప్రశ్నించారు. పోలింగ్ రోజున 144 సెక్షన్ అయితే ఉంది.. కానీ ఎక్కడా అమలు కాలేదన్నారు. చట్టాన్ని ఎవరూ తమ చేతుల్లోకి తీసుకోకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



# బట్టర్ మిల్క్, దుస్తులు పంపిణి చేసిన స్కై ఫౌండేషన్

**ముందడుగు హైదరాబాద్:**

వేసవిలో ఇబ్బందులను ఎదుర్కొంటూ విధులు నిర్వహిస్తున్న ఆర్ టి సి డ్రైవర్లు, కండక్టర్లు, , పాదచారులు, వాహనదారులకు, బట్టర్ మిల్క్, బిస్కెట్స్ అందించి, రోడ్ల పక్కన జీవనం సాగిస్తున్న అనాథలు, నిరాశ్రయులు, సంచార జాతుల వారికి దుస్తులు, బట్టర్ మిల్క్, బిస్కెట్ ప్యాకెట్స్ అందించాము. ఈ కార్యక్రమములో ప్రెసిడెంట్ డాక్టర్. వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఓ.పావని, సభ్యులు కీర్తి, మానస, ఖుషికోమల్, అఖిల్, శుభం మొదలగు వాళ్ళు పాల్గొన్నారు.

# యువత చూడాల్సిన మైక్రో చిత్రం వెన్నెల

## రవీంద్రభారతిలో ప్రివ్యూ వేడుక

**ముందడుగు హైదరాబాద్:**

సమాజానికి, యువతరానికి మంచి సందేశం ఇచ్చే మైక్రో చిత్రమని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ కార్యదర్శి మామిడాల హరికృష్ణ అన్నారు. రవీంద్రభారతిలో మైక్రో ఫిల్మ్ వెన్నెల ఎ ట్రూ స్టోరీ ప్రివ్యూ జరిగింది. ఈ వేడుకలో మామిడి హరికృష్ణతో పాటు, యూత్ ఫర్ యాంటీకరప్షన్ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి, ఫిల్మ్ హీరో విజయ్ శంకర్, సీనియర్ యాక్టర్ సంధ్య జనక్ ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. మామిడి హరికృష్ణ మాట్లాడుతూ ఇది మంచి మెసెజ్ ఇచ్చే అందమైన ప్రేమకథా చిత్రం అందరూ ఆదరించాలన్నారు. యూత్ ఫర్ యాంటీ కరప్షన్ పౌండర్ రాజేంద్ర పల్నాటి మాట్లాడుతూ శివ నాగరాజ్ ఎప్పుడు కొత్తగా ఆలోచిస్తూ కొత్తగా లఘు చిత్రాలను తీస్తున్నారు. సినిమారంగంలో ఉన్నత స్థాయికి వెళ్లాలని అన్నారు. సీనియర్ యాక్టర్ సంధ్య జనక్ మాట్లాడుతూ సినిమా అందరూ ఆలోచించే విధంగా ఉందన్నారు. హీరో విజయ్ శంకర్ మాట్లాడుతూ ఒక మంచి స్టోరీ ఇప్పటి యువతకు మంచి మెసెజ్ ఇచ్చే సినిమా అన్నారు. డైరెక్టర్ శివనాగరాజు మాట్లాడుతూ ఈ మైక్రో ఫిల్మ్ తొందర్లో ఫిక్సల్ ఆర్ట్స్ యూట్యూబ్ ఛానల్‌లో రిలీజ్ అవుతుంది. ఒక మంచి సందేశాత్మక చిత్రం అందరు చూసి మీ అభిప్రాయాన్ని తెలియ చేయండి అన్నారు. ఈ కార్యక్రమంలో వెన్నెల టీం సభ్యులు యాక్టర్ శ్రీఅనూష, ఎడిటర్ కేతన్ కంచర్ల, లిరిక్ రైటర్ శ్రీనాథ్ మహేంద్ర, డిజిటల్ ప్రమోటర్ త్రినాథ్ రెడ్డి, కేశవ హాజరయ్యారు. డిజిటల్ పార్టనర్స్ గా తెలుగు హంట్ ఛానల్ వ్యవహారిస్తుంది.








## వాష్ రూమ్, టాయిలెట్, రెస్ట్ రూమ్ ఈ మూడింటికి తేడా ఏమిటి?

# వీటి గురించి ఒకసారి తెలుసుకుందాం

**ముందడుగు ప్రత్యేకం:**

మనం ఎక్కడికైనా టూర్ లేదా షాపింగ్ వెళ్లినా ముందు వాష్‌రూమ్ చూస్తుంటాం. ఈ రోజుల్లో దాదాపు అందరి ఇళ్లల్లో బాత్‌రూమ్, వాష్‌రూమ్, టాయిలెట్ ఉంటాయి. మెట్రో నగరాల్లోని ఎత్తైన భవనాలు, హోటళ్లు, మాల్స్ మొదలైన వాటిలో వివిధ రకాల డిజైనర్ బాత్‌రూమ్‌లు, వాష్‌రూమ్‌లు, టాయిలెట్లు ఉంటున్నాయి. అయితే బాత్రూమ్, వాష్‌రూమ్, టాయిలెట్, రెస్ట్ రూమ్ మొదలైన వాటి మధ్య తేడా తెలియని వారు నేటికీ చాలా మంది ఉంటారు. ఏది దేనికి ఉపయోగించబడుతుందనే విషయంలో గందరగోళానికి గురవుతారు. చాలా మంది వాటిని ఒకేలా భావిస్తారు కానీ బాత్రూమ్, వాష్‌రూమ్, టాయిలెట్, రెస్ట్‌రూమ్ మధ్య తేడా ఏంటో ఒకసారి తెలుసుకుందాం..




### బాత్రూమ్, వాష్‌రూమ్, టాయిలెట్ మధ్య తేడా ఏమిటి?

రెండు దశాబ్దాల క్రితం, చాలా ఇళ్లలో ఒకే బాత్‌రూమ్ ఉండేది, అందులోనే స్నానం, భారతీయ టాయిలెట్ కూడా ఉండేది. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మారిపోయింది. ఇప్పుడు ఇళ్లలో వాష్‌రూమ్‌లు, బాత్‌రూమ్‌లు, ప్రత్యేక టాయిలెట్లను వారి ఆప్షన్ ప్రకారం ప్రజలు ఏర్పాటు చేసుకుంటున్నారు. వాష్‌రూమ్, బాత్రూమ్ మరియు రెస్ట్‌రూమ్ పదాలు ఇంగ్లీష్‌బాష నుండి వచ్చినవి. వాటి అర్థం కూడా వాటి ఉపయోగంపై ఆధారపడి ఉంటుంది.

### బాత్రూమ్ అంటే ఏమిటి?

రోజూ స్నానం చేసే చోటే బాత్రూమ్. కానీ, ఇక్కడ కమోడ్, టాయిలెట్ సీట్ లేవని కాదు. బాత్రూమ్ అంటే మీరు స్నానం చేయడానికి పూర్తి సౌకర్యాలు పొందే ప్రదేశం. బాత్‌రూమ్‌లను పురుషులు, మహిళలు ఇద్దరూ ఉపయోగించవచ్చు, అయితే టాయిలెట్‌లు పురుషులు, స్త్రీలకు వేర్వేరుగా ఉంటుంటాయి.

### వాష్ రూమ్ అంటే ఏమిటి?

వాష్‌రూమ్ అంటే మీకు వాష్ బేసిన్, టాయిలెట్ సీట్, అద్దం, బట్టలు మార్చుకోవడానికి స్థలం మొదలైనవి లభించే గది, కానీ ఇక్కడ స్నానం చేసే సౌకర్యం ఉండదు. మాల్స్, ఆఫీసులు, సినిమా హాళ్లలో వాష్‌రూమ్‌లు మాత్రమే ఉంటాయి తప్ప బాత్‌రూమ్‌లు ఉండవు. మీరు ఇక్కడ ఎక్కడా బాత్ టబ్ లేదా స్నానపు సౌకర్యాన్ని చూడలేరు.

### రెస్ట్ రూమ్ అంటే ఏమిటి?

రెస్ట్‌రూమ్ అంటే హాయిగా వెళ్లి పడుకునే ప్రదేశమని కొందరు అనుకుంటారు కానీ ఇది పొరపాటు. ఇది అమెరికన్ పదం, దీని అర్థం వాష్‌రూమ్. నిజానికి విదేశాల్లో ముఖ్యంగా అమెరికాలో వాష్‌రూమ్‌ని రెస్ట్‌రూమ్‌గా పిలుస్తుంటారు. మన దేశంలో రెస్ట్ రూమ్ అనే పదానికి బదులుగా వాష్‌రూమ్ అనే పదాన్ని ఎక్కువగా ఉపయోగిస్తారు. బ్రిటిష్ ఇంగ్లీషులో వాష్‌రూమ్ మరింత సరైనదిగా పరిగణించబడుతుంది, ఇక్కడ కూడా అదే ప్రబలంగా ఉంది. అదేంటంటే, ఇప్పుడు చాలా ఫైవ్ స్టార్ హోటళ్లు, మాల్‌స్‌లో కూడా రెస్ట్‌రూమ్ అనే పదాన్ని వాడే వారి సంఖ్య పెరిగింది.